
సాక్షి
తిరుపతి

శుక్రవారం । 1 । ఆగస్టు । 2025



స్వర్ణముఖి నదిలో వ్యక్తి గల్లంతు

నాయుడుపేట మండల పరిధిలో గురువారం చేపలు పట్టేందుకు స్వర్ణముఖి నదిలోకి దిగి ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. - 8లో



టీటీడీ ఆలయాల్లో 'సౌభాగ్యం'

టీటీడీ ఆలయాల్లో సౌభాగ్యం పేరుతో పసుపు, కుంకుమ, గాజులు, అక్షింతలు అందించనున్నారు. - 8లో



క్షుద్ర పూజల కలకలం

సైదాపురం మండలంలో క్షుద్ర పూజలు చేసి పురాతన ఆలయంలో గుప్త నిధుల కోసం విగ్రహాలను తొలగించారు. - 8లో

న్యూస్‌రీల్

ఇంటర్ అడ్మిషన్ల గడువు మళ్లీ పొడిగింపు

తిరుపతి సిటీ : జిల్లాలో ప్రభుత్వ, హైస్కూల్ ప్లస్, ఎయిడెడ్, రెసిడెన్షియల్, సోషల్ వెల్ఫేర్, మోడల్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రవేశాల గడువును ఈనెల 11వ తేదీ వరకు పొడిగిస్తూ ఇంటర్మీడియట్ విద్యామండలి ఉత్తర్వులు జారీ చేసిందని ఆర్ఐఓ రాజశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న అన్ని జూనియర్ కళాశాలలో పలు కోర్సులలో ఖాళీగా ఉన్న సీట్ల కోసం విద్యార్థులు నేరుగా ఆయా కళాశాలలను సంప్రదించి ప్రవేశాలు పొందవచ్చన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు అకడమిక్ పుస్తకాలతో పాటు ఎంసెట్, నీట్ మెటీరియల్స్‌ను ఉచితం పంపిణీ చేసి నాణ్యమైన విద్యను అందిస్తోందన్నారు. కాగా ఇప్పటికే పలుసార్లు అడ్మిషన్ల గడువు పొడిగించినా కొన్ని కళాశాలలో సింగిల్ డిజిట్ ప్రవేశాలు జరగడంతో ప్రభుత్వం గడువును మరోసారి పొడిగించింది.

5న ఐజర్ స్నాతకోత్సవం



ఏర్పేడు : మండలంలోని జంగాలపల్లి సమీపంలోని తిరుపతి ఐజర్‌లో ఈనెల 5వ తేదీన 6వ స్నాతకోత్సవం జరగనున్నట్లు ఐజర్ డైరెక్టర్ సంతాను భట్టాచార్య తెలిపారు. ఐజర్‌లో కోర్సులను పూర్తి చేసిన విద్యార్థులకు ఈ వేడుకలో డిగ్రీ పట్టాలను అందించనున్నట్లు ఆయన తెలిపారు.


5న పాలిటెక్నిక్ తక్షణ ప్రవేశాలు

తిరుపతి సిటీ : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 5వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహించేందుకు డైరెక్టర్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో జిల్లాలో గూడూరు, సత్యవేడు, పుత్తూరు, చంద్రగిరి, తిరుపతిలోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లకు ఆసక్తి గల విద్యార్థులు నేరుగా హాజరు కావచ్చని తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. క్యూ కాంప్లెక్స్‌లో 12 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 75,303 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.99 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 15 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం అవుతోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

మెడికిల్స్



మీకు తల నొప్పి వస్తుందా?.. తరచూ జ్వరం బారినపడుతున్నారా?.. కడుపు, ఒళ్లు నొప్పులతో భరించ లేకపోతున్నారా?.. నిద్ర పట్టడం లేదా?.. మీకు భయమేమీ లేదు..



అనారోగ్య సమస్య గురించి చెబితే చాలు.. ప్రిస్కిప్షన్ లేకుండానే మెడికల్ షాపుల్లో అన్నిరకాల మందులు ఇచ్చేస్తారు. ఎంత మొత్తంలో కావాలన్నా విక్రయిస్తారు. ఏ మందు వేసుకోవాలో.. రోజుకు ఎన్ని వేసుకోవాలో.. ఎన్ని రోజులు వాడాలో కూడా వారే సూచిస్తారు. ఇలా జిల్లాలో మెడికల్ షాపుల నిర్వాహకులు అడ్డగోలు వ్యాపారం చేస్తున్నారు. అధికారులు ఏదో ఓ సారి తనిఖీ చేయడం, నామమాత్రంగా కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారు.

నిబంధనలు పాటించని మెడికల్ షాపులు

- ప్రిస్క్రిప్షన్ లేకుండానే విక్రయాలు
- ఫిజీషియన్ శాంపిళ్లు, కాలంచెల్లిన మందుల అమ్మకాలు
- షాపుల్లో బినామీల దందా
- కానరాని ఫార్మసిస్టు
- తూతూమంత్రంగా అధికారుల తనిఖీలు
- ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్న అమాయకులు



చిత్తూరు రూరల్ (కాణిపాకం): డ్రగ్స్, కాలపరిమితి దాటిన, నకిలీ మందుల విక్రయాలు సైతం జిల్లాలో జోరుగా సాగుతున్నాయి. డాక్టర్ రాసిన కంపెనీ ఔషధాలు లేకుంటే, వాటికి బదులు వేరే కంపెనీ మందులు అంటగడుతున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే.. సేమ్ ఫార్ములా.. కంపెనీ మాత్రమే వేరు.. ఇది కూడా దానిలాగే పనిచేస్తుంది.. అని ఉచిత సలహాలు ఇస్తున్నారు. జిల్లాలో సుమారు 2,000 వరకు రిటైల్, హోల్‌సేల్ మెడికల్ షాపులున్నాయి. అలాగే చాలామంది క్లినిక్‌లోనే మెడికల్ షాపులు ఏర్పాటు చేసుకున్నారు. రోజూ ప్రతి చిన్న, పెద్ద దుకాణాల్లో రూ.5 వేల నుంచి రూ.లక్ష దాకా వ్యాపారం సాగుతోంది. ఈ వ్యాపారం ఇష్టానుసారంగా జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.



మెడికల్‌షాపు తనిఖీలో అధికారులు (ఫైల్)

తారుమారు

డ్రగ్స్ అండ్ కాస్మొటిక్స్ యాక్టు- 1940, ఫార్మసీ యాక్టు- 1948 ప్రకారంగా బీ ఫార్మసీ లేదా ఎం.ఫార్మసీ పూర్తిచేసిన వారే మెడికల్ షాపులు నిర్వహించాలి. షాపు పర్మిషన్ తీసుకునే సందర్భంలో సంబంధిత ఫార్మసిస్టుల సర్టిఫికెట్లతోపాటు వ్యక్తిగత గుర్తింపుకార్డు ప్రతులు, చిరునామా తదితర వివరాలు దరఖాస్తుతో జతచేసి డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌కు సమర్పించాలి. అనుమతి మంజూరైన తర్వాతే షాపులు నిర్వహించాలి. జిల్లాలో మెడికల్ షాపులు చాలామంది బినామీలే నిర్వహిస్తున్నారు. ప్రొఫెషనల్ ఫార్మసిస్టు ఆధ్వర్యంలో అవగాహన ఉన్న సిబ్బందితోనే దుకాణాలను నిర్వహించాలి. చాలా మంది తక్కువ వేతనంతో యువకులను పనిలో పెట్టుకుంటున్నారు. మెడికల్‌పై పరిజ్ఞానం లేని వ్యక్తులు షాపులను నడుపుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

ఇదోరకమైన దందా..

జనరిక్, నాన్ జనరిక్ తేడా లేకుండా షాపుల నిర్వాహకులు ఔషధ కంపెనీలతో పర్సంటేజీలు మాట్లాడుకొని వైద్యులతో కుమ్మక్కై ప్రజలను నిలువుదోపిడీ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొనుగోలు చేసిన మందులకు కనీసం బిల్లులు కూడా ఇవ్వకుండా విక్రయాలు చేస్తున్నారు. యాంటీబయాటిక్ మందులను డాక్టర్ల సూచనల మేరకు ఇవ్వాలి. కానీ షాపుల నిర్వాహకులు ఇష్టారీతిన వ్యవహరిస్తూ ఇస్తున్నట్లు సమాచారం. దీంతో అనవసరంగా యాంటిబయాటిక్ మందులు వాడిన వారు సైడ్ ఎఫెక్ట్‌తో కొత్తరోగాల బారిన పడుతున్నారు. ఇక బెంగళూరు నుంచి పలు రకాల బ్రాండ్‌ల పేరుతో అనధికారికంగా మందులు, మాత్రలు సరఫరా అవుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ఇవీ తక్కువ రేటుకు ఇస్తుండడంతో మార్కెట్‌లో విచ్చలవిడిగా లభ్యమవుతున్నట్టు తెలుస్తోంది.

తిరుపతి జిల్లా ఎంఆర్‌పల్లి సర్కిల్‌లోని ఓ మెడికల్ షాప్‌లో నిబంధనలకు విరుద్ధంగా మందులు, మాత్రలు విక్రయిస్తున్నారు. నిషేధిత మందులు, డాక్టర్ చీటీ లేకుండా మందులు, మాత్రలను విక్రయిస్తున్నారు. ఆ షాపుపై ఫిర్యాదులు వెలువెత్తాయి. దీంతో అధికారులు నిఘా పెట్టి పర్యవేక్షించారు. అలాగే విజిలెన్స్ అధికారులు కూడా ఆ షాపుపై దాడి నిర్వహించారు. ఈ దాడుల్లో పలు రకాల మందులు, మాత్రలు అనుమతి లేకుండా విక్రయిస్తున్నారని సీజ్ చేస్తున్నారు.



ఎర్ర చందనం కేసులో పది మందికి ఐదేళ్ల జైలు

తిరుపతి లీగల్ : అటవీ ప్రాంతంలోకి అక్రమంగా ప్రవేశించి, ఎర్ర చందనం చెట్లను నరకడానికి ప్రయత్నించిన కేసులో పది మందికి ఒక్కొక్కరికి ఐదు సంవత్సరాల చొప్పున జైలు శిక్ష, ఆరు లక్షల రూపాయల చొప్పున జరిమానా విధిస్తూ రాష్ట్ర ఎర్ర చందనం కేసుల విచారణ తిరుపతి సెషన్స్ జడ్జి నరసింహమూర్తి గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు... శేషాచలం అటవీ ప్రాంతం, ఎస్‌వీఎన్‌పీ డివిజన్, టీఎన్ పాలెం సెక్షన్, పెరుమాళ్లపల్లి బీట్ అటవీ ప్రాంతంలో 2019లో టాస్క్‌ఫోర్స్ ఫారెస్ట్ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. తమిళనాడు, తిరువణ్ణామలై జిల్లాకు చెందిన సి.విశ్వనాథన్, సేతు, రమేష్, సంపత్, రత్నం , బూచాయన్, సురేష్ , రామన్, వేలూరు జిల్లాకు చెందిన కుమార్, ప్రభు అటవీ ప్రాంతంలోకి అక్రమంగా ప్రవేశించి ఎర్రచందనం చెట్లను నరకడానికి ప్రయత్నించగా ఫారెస్ట్ సిబ్బంది వారిని అదుపులోకి తీసుకున్నారు. పదిమందిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. నేరం పది మందిపై రుజువు కావడంతో న్యాయమూర్తి వారికి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. అయితే కేసులో 8వ నిందితుడిగా అభియోగాలు ఎదుర్కొంటున్న ప్రభు గురువారం కేసు వాయిదాకు హాజరు కాకపోవడంతో అతడి న్యాయవాది ద్వారా వాయిదా పిటిషన్ దాఖలు చేసుకున్నాడు. తీర్పు వాయిదా రోజు అతడు కోర్టుకు హాజరు కాకపోవడంతో న్యాయమూర్తి ఆ పిటిషన్ కొట్టి వేస్తూ అతడిని నాన్ బెయిలబుల్ వారెంట్‌పై కోర్టులో హాజరు పరచాలని ఫారెస్ట్ సిబ్బందిని ఆదేశిస్తూ తీర్పులో పేర్కొన్నారు.

3న యోగాసన పోటీలు

తిరుపతి కల్చరల్: యోగాసన స్పోర్ట్ అసోసియేషన్ తిరుపతి శాఖ ఆధ్వర్యంలో విద్యోదయ ఎడ్యుకేషన్ సెంటర్‌లో 3వ తేదీ ఆదివారం యోగాసన పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు కైలాసింగ్ రాజ్ పురోహిత్, కార్యదర్శి ముని మంజుల తెలిపారు. గురువారం నిర్వహించిన అసోసియేషన్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. 10 నుంచి 55 ఏళ్ల వయస్సు కలిగిన యోగా సాధకులు ఈ పోటీలలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఇందులో గెలుపొందిన వారిని ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు తాడేపల్లి గూడెంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హులవుతారని తెలిపారు.

ఇంటి వద్దనే పింఛన్లు పంపిణీ చేయండి

- కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్ : ఇంటి వద్దకే వెళ్లి ఎన్టీఆర్ సామాజిక భద్రతా పింఛన్లకు చెందిన నగదును లబ్ధిదారులకు అందించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి టెలికాన్ఫరెన్స్ ద్వారా పింఛన్ల పంపిణీపై ఆయన అధికారులతో గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వర్ సమస్యలు ఉంటే పింఛన్‌దారు ఇంటికి 300 మీటర్ల లోపు నుంచి అయినా అందించాలని సూచించారు. ఉదయం 6.30 గంటలకే పింఛన్ల పంపిణీ కార్యక్రమం మొదలు కావాలని స్పష్టం చేశారు. తొలిరోజే 100 శాతం పింఛన్లు పంపిణీ చేయడానికి అధికారులు కృషి చేయాలని వివరించారు. తొలిరోజు పింఛన్లు తీసుకోని వారికి రెండవ రోజు సచివాలయం వద్ద మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల సమయంలో ఇవ్వాలని తెలిపారు. ఆగస్టు నెలలో స్పౌజ్ పింఛన్లతో కలిపి 2,63,743 మందికి రూ.11315 కోట్లు పంపిణీ చేయాల్సి ఉందని చెప్పారు. ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, డీఎల్‌డీవోలు, డీఆర్‌డీఏ అధికారులు పింఛన్ల పంపిణీ ప్రక్రియను పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. పింఛన్ల పంపిణీలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వారిపై చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.

డిగ్రీ ప్రవేశాలకు నోటిఫికేషన్ రేపు

తిరుపతి సిటీ : నాలుగు నెలలుగా నిరీక్షిస్తున్న డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు శనివారం నోటిఫికేషన్ విడుదల చేసేందుకు ఉన్నత విద్యామండలి నిర్ణయం తీసుకుంది. ఆ మేరకు కళాశాలల ప్రిన్సిపల్స్‌తో సమావేశమై నిర్ణయం తీసుకుంది. సింగిల్ మేజర్ సబ్జెక్ట్ విధానంతోనే ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తులు ఆహ్వానించేందుకు అన్ని ఏర్పాట్లు తీసుకున్నట్లు సమాచారం. ఎట్టకేలకు డిగ్రీ ప్రవేశాలపై నోటిఫికేషన్ విడుదల చేసేందుకు నిర్ణయించడంతో నెలల తరబడి జిల్లాలో నిరీక్షిస్తున్న విద్యార్థులకు ఊరట లభించనుంది.

ప్రజాభిమానం ఓర్వలేక ఆంక్షలు



నెల్లూరులో జగనన్నకు కలిసేందుకు వెళుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

- నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ధ్వజం

వెంకటగిరి(సైదాపురం) : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజలు చూపుతున్న ఆదరణను చూసి కూటమి ప్రభుత్వం భయపడుతోందని వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మాజీ మంత్రులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని పరామర్శించేందుకు నెల్లూరుకు వచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా వెంకటగిరి నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో నెల్లూరు తరలివెళ్లారు. ఈ సందర్భంగా నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం జగన్ పర్యటనకు అడుగడుగునా ఆంక్షలు విధించడం తగదన్నారు. ముళ్ల కంచెలు వేయడం, రోడ్లకు అడ్డంగా గోతులు తవ్వడం, ప్రజలపై లాఠీచార్జీ చేయడం వంటి చర్యలకు పాల్పడడం దారుణమన్నారు. జగన్‌ను చూసేందుకు వచ్చే వారిని అడ్డుకోవాలంటే అరచేతితో సూర్యుడిని ఆపాలనుకోవడమేనని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని, తగిన సమయంలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. వెంకటగిరి పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి, మండల కన్వీనర్ కాల్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, సైదాపురం మండల కన్వీనర్ ఎం.రవికుమార్, బాలయపల్లి మండల కన్వీనర్ వెందోటి కార్తీక్‌రెడ్డి ఆధ్వర్యంలో వందలాది మంది కార్యకర్తలు, నేతలు, అభిమానులు నెల్లూరుకు తరలివెళ్లారు.

మోసం బాబు నైజం

- చంద్రగిరిలో 'బాబు షూరిటీ.. మోసం గ్యారెంటీ'
- జగనన్న హయాంలో సంక్షేమం.. బాబు పాలనలో సంక్షోభం
- అక్రమ అరెస్టులతో చెవిరెడ్డిని భయపెట్టలేరు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర రెడ్డి



క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న భూమన కరుణాకరరెడ్డి, చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి



కార్యక్రమానికి హాజరైన పార్టీ నేతలు, కార్యకర్తలు

తిరుపతి రూరల్ : జగనన్న పాలనలో ప్రజలకు సంక్షేమం అందింది.. బాబు ప్రభుత్వంలో సంక్షోభం మిగిలింది.. సూపర్ సిక్స్ పథకాలను అధికారంలోకి వచ్చిన మరుసటి రోజు నుంచే అమలు చేస్తామని చెప్పిన చంద్రబాబు ఏడాది గడిచినా ఆ ఊసే ఎత్తడం లేదు.. ఉచిత గ్యాస్ ఇస్తామన్నారు.. తుస్సు మనిపించారు.. ఇదిగో అమ్మకు వందనం అన్నారు.. ఎవరికీ అందకుండా చేశారు.. ఆడబిడ్డ నిధి అన్నారు.. ఆ పథకాన్ని ఆమడదూరం చేసేశారు.. నిరుద్యోగులకు శఠగోపం పెట్టారు.. ఉద్యోగుల హామీలను గాలికి వదిలేశారు.. ఇలా ఒకటి కాదు.. రెండు కాదు 143 హామీలు ఇచ్చిన చంద్రబాబు.. ఒక్కటీ అమలు చేయకుండా మోసం చేశారు.' అంటూ వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి ఆరోపించారు.

చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట గ్రామంలో గురువారం 'బాబు షూరిటీ.. మోసం గ్యారంటీ' రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమాన్ని భూమన చేతులు మీదుగా ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆరు మండలాలకు చెందిన పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూమన మాట్లాడుతూ.. చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో బాబు చేసిన మోసాలతో పాటు చెవిరెడ్డి కుటుంబంపై చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న కుట్రలు, కక్ష సాధింపు చర్యలను ప్రతి ఇంటికీ వెళ్లి వివరించాలన్నారు. ఎన్నికలకు ముందు మాయమాటలు చెప్పడం, అధికారంలోకి వచ్చాక మోసం చేయడానికి ప్రతిపక్షంపై నిందలు వేయడం బాబుకు వెన్నతోపెట్టిన విద్య అని భూమన విమర్శించారు. బాబు షూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమంలో చంద్రబాబు మోసాన్ని ప్రజలకు వివరించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని, అప్పుడే చంద్రబాబు మళ్లీ మోసం చేశారన్న నిజం ప్రజలకు తెలుస్తుందన్నారు.

కట్టుకథలు అల్లి అక్రమ కేసులు

జగనన్నకు అతి దగ్గరగా ఉన్నందునే తన తమ్ముడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిపై అక్రమ కేసులు పెట్టి జైలులో 44 రోజులుగా బధించారని, అదే కేసులో భాస్కర్ బిడ్డ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని కూడా ఇరికించడం దుర్మార్గమన్నారు. ఇలాంటి విషయాలు పచ్చ పత్రికలు ముందే రాస్తాయని, ఎల్లో మీడియా ఓ కట్టు కథను అల్లుతాయని.. పోలీసుల ఆ కథను క్రైంగా అమలు చేస్తున్నారని భూమన కరుణాకర రెడ్డి ఆరోపించారు. పాతికేళ్లు నిండిన చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని జైలుకు పంపాలని ఈ ప్రభుత్వం చేస్తున్న కుట్రలు అంతా ఇంతా కాదని, అయితే ఏ తప్పు చేయకుండా జైలుకు వెళ్లి తిరిగి వచ్చిన వారు రాజకీయంగా ఎంతో ఎత్తుకు ఎదుగుతుండగా అక్రమంగా జైలుకు పంపిన వారి జీవితాలు మాత్రం పతనం కాక తప్పవని హెచ్చరించారు. గతంలో సోనియాగాంధీ, చంద్ర బాబు ఇద్దరు కుట్రలు చేసి వైఎస్ జగన్‌పై 18 రకాల కేసులు పెట్టి 18 నెలల పాటు జైలులో బంధిస్తే, ఆ తరువాత బయటకు వచ్చిన జగన్ విక్రమార్కుడిలా దూసుకొచ్చి ముఖ్యమంత్రి పీఠం ఎక్కారన్నారు. ఈ దుర్మార్గపు ప్రభుత్వం మళ్లీ జగన్‌ను జైలుకు పంపుతుందని.. అందులో భాగమే ఆయన చుట్టూ ఉన్న వారిని అక్రమ కేసుల్లో ఇరికించారన్నారు. చంద్రబాబు మోసాలు, చెవిరెడ్డి కుటుంబంపై ఆయన ప్రభుత్వం చేస్తున్న కుట్రలను చంద్రగిరి నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ వెళ్లి చెప్పాల్సిన బాధ్యత పార్టీ క్యాడర్ తీసుకోవాలని సూచించారు.

అండగా నిలబడ్డ వారందరినీ గుర్తు పెట్టుకుంటా

చంద్రగిరి నియోజకవర్గంలో చెవిరెడ్డి కుటుంబానికి కష్టం వస్తే ఆ కుటుంబానికి మేమున్నామని అండగా నిలబడి రోడ్డెక్కిన ప్రతి ఒక్కరినీ గుర్తు పెట్టుకుంటా.. రేపు మన పార్టీ అధికారంలోకి వచ్చాక అందరికీ చేయగలిగినంత సాయం చేసి రుణం తీర్చుకుంటానని చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి మాట ఇవ్వడంతో పార్టీ నేతలు, కార్యకర్తలు నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. చంద్రగిరి నుంచి తాను ప్రాతినిధ్యం వహించడం ఒక అదృష్టంగా భావిస్తున్నానని, తమ కుటుంబాన్ని ప్రభుత్వం ఇబ్బందులు పెడుతున్నా.. ఏ మాత్రం భయపడకుండా తమకు అండగా నిలిచి అక్రమ అరెస్టులను నిరసిస్తూ ఆందోళనలు చేయడం చూస్తుంటే పార్టీ శ్రేణుల రుణం ఎన్నటికీ తీర్చుకోలేమనిపిస్తోందన్నారు. జగనన్న ఆదేశాలు మేరకు పార్టీలో ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త తమ గ్రామాల్లోకి వెళ్లి బాబు షూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమం ద్వారా ఈ ప్రభుత్వం చేసిన మోసం, చెప్పిన అబద్ధాలను వివరించాలన్నారు. అంతేకాక ఆ నాడు ఏం చెప్పారన్న విషయాలు అందరికీ తెలిసేలా బాబు మేనిఫెస్టోను గుర్తు చేస్తూ ఆ కుటుంబం ఎంత నష్టపోయారో వివరించాలన్నారు. పచ్చి అబద్ధాలు చెప్పి అందలమెక్కిన చంద్రబాబుతో పాటు ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు ఇళ్ల వద్దకు వచ్చినప్పుడు చొక్కా పట్టుకుని అడగాలని సూచించారు. అనంతరం రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో క్యూ ఆర్ కోడ్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ చిత్తూరు జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, ఆరు మండలాల నుంచి వచ్చిన ఎంపీపీలు, జడ్పీటీసీలు, సీనియర్ పార్టీ నేతలు, కార్యకర్తలు, మాజీ ప్రజా ప్రతినిధులు, మహిళా నేతలు పాల్గొన్నారు.

ఎంఈఓల నియామకంపై ఉపాధ్యాయుల నిరసన



పాఠశాల ఎదుట నిరసన తెలుపుతున్న అపస్ నేతలు, ఉపాధ్యాయులు

- నేటి నుంచి నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరు

తిరుపతి సిటీ : రాష్ట్ర ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి సీనియారిటీని పక్కన పెట్టి ఇష్టానుసారంగా ఎంఈఓ-1ను నియమించడం దారుణమని ఏపీ ఉపాధ్యాయ సంఘం (అపస్) రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం తిరుచానూరు ఉన్నత పాఠశాలలో భోజన విరామ సమయంలో అపస్ నేతలు, ఉపాధ్యాయులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి సర్వీస్ నిబంధనల అమలు కోసం ప్రత్యేక కమిటీ ద్వారా నియామకాల విషయంపై ఉపాధ్యాయ సంఘాలు ప్రయత్నిస్తున్న తరుణంలో మండల విద్యాశాఖ అధికారి-1గా నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు ఇవ్వడం దారుణమన్నారు. ఎంఈఓ పోస్టులను కేవలం ప్రభుత్వ పాఠశాలల స్కూల్ అసిస్టెంట్లతో భర్తీ చేయడం జిల్లా పరిషత్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను అవమానపరచడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. ఏకీకృత సర్వీస్ రూల్స్‌కు సంబంధించి కోర్టు కేసు పెండింగ్‌లో ఉండగా ఇలాంటి చర్యలు చేపట్టడం సరికాదని హితవు పలికారు. శుక్రవారం నుంచి ప్రతి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా నల్లబ్యాడ్జీలను ధరించి విధులకు హాజరు కావాలని పిలుపునిచ్చారు. అలాగే భోజన విరామ సమయంలో ప్రతి పాఠశాలలో నిరసనలు తెలపాలని సూచించారు. ప్రభుత్వం నియమించిన ఎంఈఓ-1 పోస్టులను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో భవిష్యత్తు కార్యాచరణపై ఉపాధ్యాయులతో చర్చించి ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో అపస్ రాష్ట్ర కార్యదర్శి గజ్జల వెంకట సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అసిస్టెంట్ రిజిస్ట్రార్‌లుగా నియామకం



పదోన్నతులు పొందిన ఉద్యోగులను అభినందిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

తిరుపతి సిటీ: ఎస్వీయూలో ఏఏఓలుగా పనిచేస్తున్న పలువురు ఉద్యోగులు అసిస్టెంట్ రిజిస్ట్రార్‌లుగా తిరిగి పదవులు పొందారు. వీరిలో జితేంద్ర నాయక్, మహమ్మద్ రఫీ, కవిత, వెంకటరమణ, విజయ్‌కుమార్, సురేష్ కుమార్, లోకనాథం ఉన్నారు. పదోన్నతులు పొందిన ఉద్యోగులను ఎస్వీయూ వీసీ, రిజిస్ట్రార్ అభినందించారు.

నేడు డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ క్యాంప్

తిరుపతి ఎడ్యుకేషన్ : బీఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఉద్యోగులకు మెరుగైన సేవలందించాలని సెంట్రల్ జోన్ ప్రిన్సిపల్ సీసీఏ అశోక్‌కుమార్ తెలిపారు. తిరుపతిలోని ఉమ్మడి చిత్తూరు జిల్లా బీఎస్ఎన్ఎల్ ప్రధాన కార్యాలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. బీఎస్ఎన్ఎల్ సీసీఏ కార్యాలయంలో రిటైర్డ్ ఉద్యోగులకు నేడు నిర్వహించనున్న డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ క్యాంపు ఏర్పాటు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉద్యోగులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. రిటైర్డ్ ఉద్యోగులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన సేవలందించేందుకు కృషి చేయాలని కోరారు. పెన్షనర్ల సౌకర్యార్థం శుక్రవారం నిర్వహించే డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ క్యాంపునకు రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. జాయింట్ సీసీఏ అంకుర్ కుమా ర్, ఉమ్మడి చిత్తూరు జిల్లా జీఎం అమరేంద్రరెడ్డి, డెప్యూటీ జీఎం వెంకోబరావు, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ శ్రీనివాసరావు, నాగమహేష్, నీరజ, గురుమూర్తి, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలకు ప్రాధాన్యం

చంద్రగిరి : రైతు ఉత్పత్తిదారులు(ఎఫ్‌పీఓ) సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని అధిక ఆదాయాన్ని పొందాలని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఉద్యానవన పంటలకు అధిక ప్రాధాన్యం ఇచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జేసీ శుభం భన్సల్‌తో కలిసి రైతు ఉత్పత్తిదారుల సంస్థ(ఎఫ్‌ఓపి) అభివృద్ధి కోసం జిల్లా స్థాయి పర్యవేక్షణలో కమిటీ సమావేశం, అగ్రిస్టాక్ వర్క్‌షాప్‌ను మండల, డివిజన్ వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు ఉత్పత్తిదారుల సంస్థల (ఎఫ్‌పిఓ) సభ్యులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎఫ్‌పీఓ సభ్యుల కార్యక్రమాలు, ప్రభుత్వం నుంచి వారి అభివృద్ధికి కావాల్సిన సహకారానికి చర్యలు తీసుకుంటామన్నారు. సాంకేతిక పరిజ్ఞానంలో భాగంగా డ్రోన్లను అధిక శాతం వినియోగించుకోవాలన్నారు. ఆయిల్ ఫాం, ఆక్వా రంగంలో ఇటీవల మంచి రాబడులు వస్తున్నాయని, ఆక్వా రంగం వైపు రైతులు దృష్టి సారించాలన్నారు.

అగ్రిస్టాక్, ఏఐపై వర్క్‌షాప్..!

అగ్రిస్టాక్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ద్వారా తీసుకువచ్చే నూతన వ్యవసాయ మార్పులపై వ్యవసాయ, అనుబంధ శాఖ అధికారులకు కలెక్టర్ వర్క్‌షాప్ నిర్వహించారు. అగ్రిస్టాక్ అనేది రైతు రిజిస్ట్రీ, జియో-రిఫరెన్స్ విలేజ్ మ్యాప్స్, క్రాప్ ఫోన్ రిజిస్ట్రీతో సహా ముఖ్యమైన వ్యవసాయ డేటా సెట్లను ఏకీకృతం చేసే సమాఖ్య అన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద రావు, జిల్లా హార్టికల్చర్ అధికారి దశరథరామిరెడ్డి, జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి రవి కుమార్, ఎల్‌డీఎంలు రవి కుమార్, సునీల్, నాబార్డ్ డీడీఎం సతీష్ కుమార్, జిల్లా సూక్ష్మ నీటిపారుదల శాఖ అధికారి శ్రీనివాసులు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ జగదీశ్, రీజనల్ మేనేజర్ భాస్కరయ్య, రైతు ఉత్పత్తిదారుల సంస్థ సభ్యులు, వ్యవసాయ శాఖ ఏడీలు, ఏఓలు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

క్షుద్ర పూజల కలకలం



పురాతనమైన ఆలయం



దేవుడి విగ్రహం వెనుక వైపు జరిపిన తవ్వకాలు

- ఆలయంలో గుప్త నిధుల కోసం తవ్వకాలు
- భయాందోళన చెందుతున్న స్థానికులు

సైదాపురం : మండలంలోని తోచాం గ్రామంలో గురువారం క్షుద్ర పూజలు కలకలం రేపాయి. కొందరు గుర్తుతెలియని వ్యక్తులు గుప్త నిధుల కోసం గ్రామ పొలిమేరలో బుధవారం క్షుద్ర పూజలు చేసి పురాతన శ్రీకృష్ణుని ఆలయంలో తవ్వకాలు చేశారు. మండలంలోని తోచాం గ్రామ సమీపంలో పురాతనమైన శ్రీకృష్ణుని ఆలయం ఉంది. పురాతనమైన ఆలయం కావడంతో అక్కడ గుప్త నిధులుంటాయనే అనుమానంతో గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం రాత్రి ఆలయంలోకి ప్రవేశించి ప్రత్యేక పూజలు చేసి విగ్రహాలను ఆ ప్రాంతం నుంచి తొలగించి తవ్వకాలు జరిపారు. తోచాం పొలిమేరల్లో బుధవారం రాత్రి అమ్మవారి బొమ్మను వేసి పసుపు, కుంకమలతో క్షుద్ర పూజలు చేసిన ఆనవాలు లభ్యం అయ్యాయి. దీంతో గ్రామస్తులకు అనుమానం రావడంతో ఆలయాన్ని పరిశీలించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి విగ్రహాలను తొలగించారు. కొద్ది రోజుల నుంచి సమీప గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆలయ పరిసర ప్రాంతంతో పాటు గ్రామంలో సంచరిస్తుండటంతో అనుమానం కలిగి అతడిని పట్టుకుని విచారణ చేస్తుండగా వారి నుంచి తప్పించుకుని పారిపోయాడన్నారు. దీంతో గ్రామస్తులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్షుద్ర పూజలు జరగడంతో గ్రామ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

జాతీయ స్థాయిలో ఎస్పీడబ్ల్యూ విద్యార్థుల ప్రతిభ



జాతీయ స్థాయిలో పతకాలను సాధించిన విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ సి భువనేశ్వరి

తిరుపతి సిటీ: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం వసంత్ విహార్ బిలాస్‌పూర్‌లోని బత్రాయ్ ఇండోర్ స్టేడియం వేదికగా జూలై 26 నుంచి 29వ తేదీ వరకు జరిగిన జాతీయస్థాయి గ్రాప్లింగ్ (కుస్తీ) పోటీల్లో పద్మావతి మహిళా జూనియర్ కళాశాల విద్యార్థినులు బంగారు, వెండి, కాంస్య పతకాలను సాధించారు. జాతీయస్థాయిలో రాణించిన విద్యార్థినులను ప్రిన్సిపల్ డాక్టర్ సి.భువనేశ్వరి గురువారం అభినందించారు. ఇదే స్ఫూర్తితో కళాశాలలకు, టీటీడీ సంస్థకు మరింత పేరుప్రతిష్టలు తేవాలని విద్యార్థులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా కోచ్ సాయి సమితిని ప్రత్యేకంగా అభినందించి ప్రశంసించారు. జాతీయ స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థుల్లో సౌమ్య బంగారు, కాంస్య పతకాలు సాధించగా, ఆర్.లావణ్య వెండి పతకం, ఆర్.దీపిక, శశిరేఖ, పూజశ్రీ, వైష్ణవి కాంస్య పతకాలు సాధించారు.

వాకాడు తహసీల్దార్ సస్పెన్షన్

వాకాడు: వాకాడు తహసీల్దార్ రామయ్యను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. తహసీల్దార్ రామయ్య లైంగిక వేధింపులకు పాల్పడినట్టు ఆరోపిస్తూ పత్రికలు, సామాజిక మాధ్యమాల్లో వార్తలొచ్చాయి. బాధిత మహిళా వీఆర్వో కలెక్టర్‌కు ఫిర్యాదు కూడా చేశారు. ఈ నేపథ్యంలో రామయ్యను సస్పెండ్ చేశారు. ఆరోపణలపై విచారణ అధికారిగా లీగల్ సెల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోజ్‌మాండ్‌ను నియమించారు.

ప్రభుత్వ కళాశాలకు కంప్యూటర్ల వితరణ



కంప్యూటర్లు, టేబుళ్లను విరాళంగా అందజేస్తున్న దాత దశరథ రెడ్డి

చంద్రగిరి : స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు ఓ దాత గురువారం కంప్యూటర్లు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ... విద్యార్థినుల ఉన్నతి కోసం ప్రముఖ పారిశ్రామిక వేత్త, అమ్మార్స్ సంస్థ చైర్మన్ దశరథ రెడ్డి కొన్నేళ్లుగా తన ఔదార్యాన్ని చాటుకుంటున్నారన్నారు. దాత దశరథ రెడ్డి తన సొంత సంస్థ ద్వారా 15 కంప్యూటర్లు, 15 కంప్యూటర్ డెస్కులు, 15 కుర్చీలను విరాళంగా అందజేయడం సంతోషంగా ఉందన్నారు. అదే విధంగా చంద్రగిరి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలకు 5 కంప్యూటర్లు వితరణ చేశారన్నారు. అనంతరం దాత దశరథరెడ్డి మాట్లాడుతూ. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర కళాశాల ప్రిన్సిపల్ ప్రకాష్, బాలికల కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

8న సామూహిక వరలక్ష్మి వ్రతం

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయానికి ఉపాలయమైన బ్రహ్మగుడి ఆవరణలో 8వ తేదీ శుక్రవారం సామూహిక వ్రతం నిర్వస్తున్నట్లు ఈఓ బాపిరెడ్డి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 7 గంటల నుంచి వ్రతం ప్రారంభమవుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు మృతి

తిరుపతి క్రైమ్ : తిరుపతి వెస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరు వ్యక్తులు వేరువేరు ప్రాంతాల్లో మృతి చెందిన సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. వెస్ట్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. జూ పార్క్ రోడ్‌లోని అటవీ ప్రాంతంలో సుమారు 55 నుంచి 60 సంవత్సరాలు గల ఓ పురుషుడు చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. అయితే ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడు? ఎక్కడి నుంచి వచ్చాడు? ఎవరు అన్నది.. తెలియాల్సి ఉందన్నారు. అదేవిధంగా అలిపిరి లగేజీ సెంటర్ వద్ద సుమారు 55 సంవత్సరాలు గల ఓ మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిందింది. ఈ రెండు వేర్వేరు ఘటనలపై కేసు నమోదు చేసి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. మృతుల ఆచూకీ తెలిస్తే.. వెస్ట్ పోలీసులను సంప్రదించాలన్నారు.

నీటి సంపులో పడి కార్మికుడి మృతి



మృతిచెందిన శ్రీరామ్

నాయుడుపేట టౌన్: మేనకూరు సెజ్ పరిధి ఉన్న ఓ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుడు శ్రీరామ్(21) గురువారం ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు. గుంటూరుకు చెందిన శ్రీరామ్ రెండేళ్లుగా బ్రేక్స్ ఇండియా పరిశ్రమలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. అతను వెంకటగిరిలో నివాసం ఉంటూ ప్రతిరోజూ పరిశ్రమకు వస్తుంటాడు. గురువారం విధులకు హాజరై నీటి సంపు సమీపంలో పనిచేస్తూ ప్రమాదవశాత్తు అందులో పడిపోయాడు. చాలా పైనుంచి సంపులో పడిపోయిన శ్రీరామ్‌ను అక్కడి కార్మికులు గుర్తించి బయటకు తీసి హుటాహుటిన ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. శ్రీరామ్ అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సీఐ బాబి వైద్యశాలకు వద్దకు వెళ్లి పరిశీలించారు. అనంతరం పరిశ్రమ వద్దకు వెళ్లి నీటి సంపు తదితర ప్రాంతాలను పరిశీలించారు. పోలీసులు కేసు నయోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూటమి నేత ఇంటి వద్దే ఇసుక విక్రయాలు

- స్వర్ణముఖి నుంచి యథేచ్ఛగా ఇసుక దోపిడీ



ఏ.రంగంపేట నుంచి అటవీ బంగ్లాకు వెళ్లే మార్గంలో కూటమి నేత ఇంటి వద్ద జేసీబీతో ట్రాక్టర్‌కు ఇసుక నింపుతున్న దృశ్యం

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : పట్టపగలే ఓ కూటమి నేత ఇంటి వద్ద భారీ ఇసుక డంపు చేసి, యథేచ్ఛగా ఇసుక విక్రయాలు చేస్తుండడం విశేషం. మండల పరిధిలోని ఏ.రంగంపేటకు చెందిన పంచాయతీ నాయకుడు అనే చెప్పుకునే ఓ నేత రాత్రి వేళల్లో జేసీబీ సాయంతో స్వర్ణముఖి నదిలో యథేచ్ఛగా ఇసుక దోపిడీకి పాల్పడుతున్నాడు. అధికార పార్టీ అండ దండలతో వందల లోడ్లు అక్రమంగా దోచుకోవడంతో పాటు ఇసుకను తన స్వంత ఇంటి వద్దే డంపు చేస్తున్నారు. అలా డంపు చేసిన ఇసుకను డిమాండ్ బట్టి భారీగా విక్రయాలు సాగిస్తున్నట్లుగా స్థానికులు చర్చించుకుంటున్నారు. అధికార పార్టీ నేతల ఇసుక అక్రమ రవాణాలో పోలీసు, రెవెన్యూ శాఖలోని కొంత మంది సహకారం సంపూర్ణంగా అందుతోందనే ఆరోపణలు లేకపోలేదు. వారం వారం అధికారులకు వాటాలు వెళ్లడంతోనే జాతీయ రహదారికి ఆనుకుని జరుగుతున్న ఇసుక స్మగ్లింగ్‌పై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు సంజన



ఎంపికైన విద్యార్థిని సంజనతో హెచ్ఎం, పీడీలు

బుచ్చినాయుడుకండ్రిగ : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న సంజన జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు రమణయ్య తెలిపారు. జులై 25వ తేదీ నుంచి 28వ తేదీ వరకు పంజాబ్ రాష్ట్రంలోని చండీగఢ్‌లో జరిగిన అండర్-17 విభాగంలో ప్రతిభ కనబరచడంతో జాతీయ స్థాయికి ఎంపిక అయినట్లు తెలిపారు. ఈ మేరకు విద్యార్థిని సంజనను హెచ్ఎం రమణయ్య, పీడీలు మస్తానయ్య, హరిబాబు అభినందించారు. విద్యార్థిని కబడ్డీ పోటీలలో పాల్గొనడానికి సహకారం అందించిన మ్యాజిక్ బస్సు ఇండియా ఫౌండేషన్ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

పొదుపు సంఘాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ

తిరుపతి అర్బన్ : అవినీతి అక్రమాలకు తావులేకుండా మహిళా పొదుపు సంఘాలు అభివృద్ధి చెందాలని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. గురువారం తిరుపతి రామానుజ సర్కిల్‌లోని ఓ హోటల్‌లో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో పొదుపు సంఘాల శిక్షణ ముగింపు కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత జూన్‌కు రాష్ట్రంలో పొదుపు సంఘాలను ఏర్పాటు చేసి 25 ఏళ్లు పూర్తయిందని గుర్తు చేశారు. ఆగస్టు చివరిలో పాతికేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఓ కార్యక్రమాన్ని నిర్వహించాలని డీఆర్‌డీఏ అధికారులకు సూచించారు. పొదుపు సంఘాల నిర్వహణ పటిష్టంగా ఉండాలని సూచించారు. డీఆర్‌డీఏ పరిధిలో (రూరల్) 34 వేల సంఘాల్లో 3.40 లక్షల మంది సభ్యులు, మెప్మా పరిధిలో(అర్బన్) 13వేల సంఘాల్లో 1.30 లక్షల మంది సభ్యులు ఉన్న నేపథ్యంలో వారి అభివృద్ధిపై డీఆర్‌డీఏతోపాటు మెప్మా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శోభనబాబుతోపాటు పలువురు డీఆర్‌డీఏ ఉద్యోగులు, పొదుపు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

1200 ఓట్లు దాటితే కొత్త పోలింగ్ కేంద్రం



పార్టీల నేతలతో మాట్లాడుతున్న డీఆర్వో నరసింహులు

తిరుపతి అర్బన్ : ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 1200 ఓట్లు దాటితే కొత్త పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని ఉత్తర్వులు ఉన్నాయని డీఆర్వో నరసింహులు తెలిపారు. గురువారం ఆయన గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నేతలతో కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1200 ఓట్లు దాటిన పోలింగ్ కేంద్రాలు గుర్తించి...162 కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అంతేకాకుండా జిల్లాలో 33 పోలింగ్ కేంద్రాలను మార్పు చేస్తున్నామని, 8 పోలింగ్ కేంద్రాలకు పేర్లు మార్చుతున్నామని, ఓట్లు తక్కువగా ఉన్న రెండు పోలింగ్ కేంద్రాల్లో ఒక్కటిగా చేయడానికి నాలుగు పోలింగ్ కేంద్రాలను గుర్తించామని వివరించారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి ఏ రాజకీయ పార్టీకి అయినా అభ్యంతరాలు ఉంటే ఫిర్యాదు చేస్తే ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మాత్రమే ఎప్పటికప్పుడు సరిచేస్తామని స్పష్టం చేశారు.

టీటీడీ ఆలయాల్లో 'సౌభాగ్యం'

తిరుపతి అన్నమయ్య సర్కిల్ : వరలక్ష్మి వ్రతం సందర్భంగా ఆగస్టు 8న టీటీడీ, హిందూ ధర్మప్రచార పరిషత్ సంయుక్తంగా సౌభాగ్యం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపట్టింది. ఈ క్రమంలో సౌభాగ్యం సామగ్రికి శ్వేత భవనంలోని హాలులో గురువారం అధికారులు, సిబ్బంది, శ్రీవారి సేవకులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయాల వారీగా పార్సిల్ ప్యాకెట్లు సిద్ధం చేశారు. వరలక్ష్మి వ్రతం రోజున టీటీడీ ఆలయాలలో సౌభాగ్యం పేరుతో మహిళలకు గాజులు, పసుపు, కుంకుమ, అక్షింతలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలలోని 51 ఆలయాలలో మహిళలకు గాజులు, శ్రీ పద్మావతి అమ్మవారి కుంకుమ ప్యాకెట్లు, కంకణాలు, పసుపు దారాలు, శ్రీ పద్మావతీ అమ్మవారి లక్ష్మీ అష్టోత్తర శత నామావళి పుస్తక ప్రసాదాలను అందించనున్నారు. ఈ సందర్భంగా సుమంగళి ద్రవ్యాలను సౌభాగ్యవతులకు పంపిణీ చేసేందుకు ఓ అజ్ఞాత భక్తుడు విరాళంగా అందించారు. కార్యక్రమంలో హిందూ ధర్మప్రచార పరిషత్ సంచాలకులు శ్రీరామ్ రఘునాథ్, అదనపు సంచాలకులు రాంగోపాల్, ఏఈవో శ్రీరాములు, సూపరింటెండెంట్ ఢిల్లీ రెడ్డి, శ్రీవారి సేవకులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో తడుకు విద్యార్థుల ఘనత



ఏఐసీటీఈ డైరెక్టర్ల నుంచి పురస్కారం అందుకుంటున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

తిరుపతి సిటీ : ఢిల్లీ వేదికగా జాతీయ వైజ్ఞానిక ప్రదర్శనలో భాగంగా నిర్వహించిన వర్క్‌షాపులో తిరుపతి జిల్లా వడమాల పేట మండలం, తడుకు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. గత మాసం 28 నుంచి 31వరకు నిర్వహించిన పోటీలో ఉత్తమ ప్రదర్శన కనబరిచి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అభినందనలు పొందారు. ఈ సందర్భంగా ఏఐసీటీఈ డైరెక్టర్, అసిస్టెంట్ డైరెక్టర్ విద్యార్థులకు ఇన్నోవేషన్ కోటాలో ఉత్తమ ప్రదర్శన అవార్డును అందజేశారు. దీంతో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఐఐటీ, నిట్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న ఇంజినీరింగ్ విద్యాసంస్థలలో ప్రత్యేక కోటా కింద సీట్లు కేటాయిస్తామని తెలిపారు. తడుకు చెందిన విద్యార్థులు హేమశ్రీ, గీతిక, హేమంత్ సోలార్ మిని పాస్ట్ కంపోస్టర్‌ను తయారు చేయడంపై కేంద్ర ప్రభుత్వం ప్రశంసలు కురిపించింది. జిల్లా సైన్స్ అధికారి భాను ప్రసాద్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

సంక్షేమ హాస్టళ్ల సమస్యలపై ఉద్యమం

- నేడు కలెక్టర్‌కు సమస్యలపై వినతిపత్రం



హాస్టల్‌లో సమస్యలు తెలుసుకుంటున్న వైఎస్సార్ విద్యార్థి సంఘం నేతలు

తిరుపతి అర్బన్ : సంక్షేమ హాస్టళ్ల సమస్యల పరిష్కారానికి మొదలెట్టిన యుద్ధం ఆపలేరని వైఎస్సార్ స్టూడెంట్స్ యూనియన్ ఎస్వీ యూనివర్సిటీ అధ్యక్షుడు మన్నం ప్రేమ్‌కుమార్ స్పష్టం చేశారు. సంక్షోభంలో కూరుకుపోయిన సంక్షేమ హాస్టళ్ల బండారం బయటపడి కూటమి ప్రభుత్వం తమ కార్యక్రమాన్ని అడ్డుకుంటోందని ఆరోపించారు. నాలుగో రోజు వైఎస్సార్ విద్యార్థి సంఘం నేతలు గురువారం తిరుపతిలోని ఎస్సీ, బీసీకి చెందిన పలు హాస్టల్స్‌ను పరిశీలించారు. అక్కడి సమస్యల గురించి స్వయంగా పిల్లలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశాలతో వైఎస్సార్ స్టూడెంట్స్ యూనియన్ చేపట్టిన సంక్షేమ హాస్టళ్ల బాట, కూటమి ప్రభుత్వానికి కంటగింపుగా మారిందని పేర్కొన్నారు. పరిశీలనలో గుర్తించిన సమస్యలను శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం ద్వారా అందజేస్తామని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు ముని, రాజా, మహేష్, హేమంత్, మధు, జగదీష్, తదితరులు పాల్గొనడం జరిగింది.

స్వర్ణముఖి నదిలో వ్యక్తి గల్లంతు

- చేపలు పట్టేందుకు దిగి ఊబిలో పడిపోయి..
- రాత్రి వరకు గాలించినా దొరకని ఆచూకీ

నాయుడుపేట టౌన్: స్వర్ణముఖి నదిలో చేపలు పట్టేందుకు దిగి గురువారం సాయంత్రం ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నాయుడుపేట మండల పరిధిలోని అయ్యప్ప రెడ్డి పాళెం గ్రామ సమీపంలోని స్వర్ణముఖి నదిలో దిగి దుప్పల వెంకటేశ్వర్లు (42) అనే వ్యక్తి గురువారం సాయంత్రం చేపలు పట్టుకుంటుండగా సమీపంలో ఉన్న వారు గుర్తించారు. కాస్సేపటి తర్వాత అతను నది ఊబిలో పడిపోయినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న సీఐ బాబి, ఎస్ఐ ఆదిలక్ష్మి, అగ్నిమాపక శాఖ అధికారి సునీల్ సిబ్బందితో నది వద్దకు చేరుకున్నారు. బెలూన్ పడవతో నదిలో రాత్రి వరకు గాలించారు. అయితే అతని ఆచూకీ లభించలేదు. తర్వాత గాలింపు చర్యలు నిలిపివేశారు. శుక్రవారం ఉదయం తిరిగి గాలింపు చర్యలు చేపడుతామని అగ్నిమాపక శాఖ అధికారి వెల్లడించారు.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

తిరుపతి క్రైమ్ : మద్యానికి బానిసైన భర్తను మార్చే క్రమంలో మనస్తాపానికి గురై ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఈస్ట్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. లక్ష్మీపురంలోని సాయిబాబా గుడి సమీపంలో నివాసం ఉంటున్న గజేంద్ర ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. ఆయనకు భార్య కన్మణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గజేంద్ర తరచూ మద్యం తాగి ఇంటికొస్తుండడంతో ఆమె తీవ్రంగా మనస్తాపానికి గురయ్యేది. ఇదే క్రమంలో మద్యం మానేయాలని భర్తతో గురువారం వాదించింది. అమ్మవారి ఆలయానికి వచ్చి చేతికి దారం కట్టుకొని ప్రమాణం చేయాలని బతిమాలింది. దీంతో భర్త ఒప్పుకోకపోవడంతో.. మనస్తాపం చెంది ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది.హాస్పిటల్‌కు తరలించే ప్రయత్నం చేయగా.. మార్గమధ్యలోనే మృతి చెందింది. దీనిపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

అన్నదాత సుఖీభవ జాబితా ప్రదర్శించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం భన్సల్

చంద్రగిరి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అన్నదాత బ్యాంకు ఖాతాలలో జమ చేయనున్న అన్నదాత సుఖీభవ పథకం ప్రారంభం కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. గురువారం అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయం నుంచి అన్నదాత సుఖీభవ, ఇతర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆగస్టు 2వ తేదీన అన్నదాత సుఖీభవ పథకం ప్రారంభోత్సవం చేపట్టడం కోసం అన్ని ఏర్పాట్లు చేపట్టాలన్నారు. జిల్లాలో అన్నదాత సుఖీభవ కింద 1,54,807 మంది రైతులు అర్హత కలిగి ఉండగా, అందులో ఇప్పటి వరకు 1,50,161 మంది రైతులు ఈకేవైసీ పూర్తి చేయడం జరిగిందని, 3,114 మంది ఈకేవైసీ రిజెక్ట్ అయిందన్నారు. 1,532 మంది ఈకేవైసీ పెండింగ్ ఉందని, ఈ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ పథకం కింద ఏడాదికి రైతుకు రూ.20,000 నగదును 3 విడతలుగా ప్రభుత్వం ఇవ్వనుందని, మొదటి విడతలో రాష్ట్రం వాటా రూ.5 వేలు, కేంద్రం వాటా రూ.2,000 చొప్పున ఆగస్టు 2న విడుదల చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలోని రైతు సేవా కేంద్రాల్లో అన్నదాత సుఖీభవ పథకం కింద అర్హులైన రైతుల జాబితా ప్రదర్శించాలన్నారు.